AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
6-10-2025 (Monday)
MAIN EDITION

## మరిన్ని ఎస్–400ల కొనుగోలుకు కేంద్రం ఆసక్తి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రక్షణను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్400 వైమానిక రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు రష్యాతో భారత్ చర్చలు జరుపుతోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ డిసెంబర్‌లో భారత పర్యటనకు రానున్నారు. ఆయన పర్యటనకు రాకముందే ఇరు దేశాల మధ్య రక్షణ ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది.

## ప్రైమరీ మార్కెట్‌లోకి భారీ ఐపీవోలు..




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రైమరీ మార్కెట్‌లోకి కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఈ వారంలో రెండు భారీ ఐపీవోలు వస్తున్నాయి. మెయిన్‌బోర్డ్ నుంచి వస్తున్న టాటా క్యాపిటల్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీవోలు రెండు కలిపి రూ. 27 వేల కోట్లపైన సమీకరించనున్నాయి. రూబికాన్ రీసెర్చ్, కెనరా రొబెకో, కెనరా హెచ్‌ఎస్‌బీసీల సబ్‌స్క్రిప్షన్ కూడా ప్రారంభం కానుంది. అలాగే ఈ వారంలో రికార్డు స్థాయి ఐపీవో వస్తోంది. టాటా క్యాపిటల్ రూ. 15,512 కోట్లతో పబ్లిక్ ఇష్యూకు వస్తున్న విషయం తెలిసిందే. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా రూ.11,607 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు వస్తోంది.

## బీజేపీ ఎంపీపై దాడి.. తీవ్రగాయాలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్: పశ్చిమ బెంగాల్‌లో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన ఎంపీపై కొందరు దాడి చేశారు. మాల్దాహా బీజేపీ ఎంపీ ఖగెన్ ముర్ము సోమవారం మధ్యాహ్నం వరద ప్రభావిత జల్పైగురి ప్రాంతంలో పర్యటించారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే శంకర్ ఘోష్, బీజేపీ నాయకులు ఉన్నారు.**

## ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ రాజీనామా



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్: ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ తన పదవికి రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజుల్లోనే అధికారం నుంచి తప్పుకున్నారు. ఆయన నియమించిన కేబినెట్‌పై విమర్శలు రావడంతో సోమవారం రాజీనామా ప్రకటించారు. ఈ మేరకు రాజీనామాను రిపబ్లిక్ అధ్యక్షుడికి సమర్పించగా.. ఆయన దానిని ఆమోదించారు.**

## ర్యాట్ యాక్టివేట్‌పై డీజీసీఏ దర్యాప్తు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్: ఎయిరిండియా విమానంలో ఇటీవల ఎమర్జెన్సీ లేకపోయినా ర్యాట్ యాక్టివేట్ అయిన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం డీజీసీఏ దర్యాప్తు ప్రారంభించింది. శనివారం అమృత్‌సర్ నుంచి బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌కు చేరుకున్న ఎయిరిండియా విమానంలో ల్యాండింగ్‌కు కొన్ని నిమిషాల ముందు ర్యాట్ యాక్టివేట్ అయింది.**

## సీజేఐపై దాడికి యత్నం



**అక్షరటుడే, న్యూఢిల్లీ :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నం జరిగింది. కోర్టులో ఓ లాయర్ దాడికి యత్నించినట్లు సమాచారం. సోమవారం సుప్రీంకోర్టులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ న్యాయవాది వేదిక దగ్గరకు వెళ్లి షూను తీసి న్యాయమూర్తిపై విసిరేందుకు ప్రయత్నించాడు. అయితే, కోర్టులో ఉన్న భద్రతా సిబ్బంది సకాలంలో జోక్యం చేసుకుని న్యాయవాదిని బయటకు తీసుకెళ్లారు. సదరు లాయర్ బయటకు వెళ్తూ.. "సనాతన్ కా అప్మాన్ నహి సహేంగే" అని వ్యాఖ్యానించినట్లు సమాచారం. షాక్ నుంచి తేరుకున్న న్యాయమూర్తి.. న్యాయవాదులు తమ వాదనలను కొనసాగించమని కోరారు.

## నిలిచిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్

**అక్షరటుడే, నల్గొండ :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఎంతకూ రైలు కదలకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇంజిన్‌లో లోపం తలెత్తడంతో రైలు ఆగిపోయినట్లు సిబ్బంది గుర్తించారు. రైల్వే అధికారులు మరో ఇంజిన్ తెప్పించి రైలును పంపించారు.




**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నగారా మోగింది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 10న నోటిఫికేషన్ వెలువడనుంది. కాగా.. నవంబర్ 11 ఎన్నిక జరుగనుంది. అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో అభ్యర్థుల ఎంపిక విషయంలో ప్రధాన పార్టీలు తర్జనభర్జన పడుతున్నాయి. అధికార పార్టీలో టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. సీనియర్ నేతలతో పాటు పలువురు యువ నాయకులు సైతం ఉత్సాహంగా ఉండడంతో టికెట్ ఎవరికి దక్కుతుందనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీజేపీలో సైతం పలువురు టికెట్ ఆశిస్తున్నారు. బీఆర్ఎస్ ఇప్పటికే తమ అభ్యర్థిగా మాగంటి సునీతను ప్రకటించింది. బీజేపీ సైతం అభ్యర్థిని త్వరలో ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# తర్జనభర్జన

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు మోగిన నగారా
- నవంబర్ 11న ఎన్నిక
- అభ్యర్థి ఎంపిక కోసం కాంగ్రెస్, బీజేపీ మల్లగుల్లాలు
- టికెట్ కోసం పోటాపోటీ
- త్వరలో పూర్తికానున్న అభ్యర్థుల ఎంపిక

అసెంబ్లీ ఎన్నికలకు ముందు వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవల ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపించింది. అది అక్కడే పెండింగ్‌లో ఉండడంతో మంత్రి మండలిలో ఆమోదించి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేసింది. కాగా.. బీసీలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పిన నేపథ్యంలో.. జూబ్లీహిల్స్ టికెట్‌ను కూడా బీసీ అభ్యర్థికి ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు సమాచారం. అలాగే బీజేపీ టికెట్ ఎవరికి ఇస్తుందోననే ఆసక్తి నెలకొంది.

### పట్టుబడుతున్న అంజన్

జూబ్లీహిల్స్ టికెట్ కోసం మాజీ ఎంపీ, బీసీ నాయకుడు అంజన్‌కుమార్ యాదవ్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ మేరకు హైకమాండ్ వద్ద తీవ్ర స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నారు. అదే సమయంలో టికెట్ తనకు రాకుండా చేస్తున్న కొందరు మంత్రుల తీరుపై బహిరంగంగానే తీవ్ర విమర్శలు గుప్పించారు. స్థానికులకే టికెట్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై అంజన్ ఇటీవల ఫైర్ అయ్యారు. అలా చెప్పడానికి ఆయనకేమీ అధికారం ఉందని ప్రశ్నించారు. మరోవైపు, మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌లో చేరిన మాజీ మేయర్, బీసీ వర్గానికి చెందిన బొంతు రామ్మోహన్ కూడా తనకే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. మరో ఇద్దరు, ముగ్గురు సైతం తమకే అవకాశం కల్పించాలని ఒత్తిడి పెంచుతున్నారు.

### నలుగురి పేర్లు సిఫారసు

టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలోనే అభ్యర్థి ఎంపికపై తాజాగా కీలక సమావేశం జరిగింది. ఈ భేటీలో నలుగురి పేర్లను ఇన్‌చార్జి మంత్రులు సిఫారసు చేశారు. ఆర్థిక, సామాజిక బలాబలాలు పరిశీలించిన తర్వాత ఆ నలుగురి పేర్లను ఫైనల్ చేశారు. మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, నవీన్ యాదవ్‌తో పాటు సీఎన్ రెడ్డి పేర్లను ప్రతిపాదించారు. వీరిలో సర్వేలు, నివేదికల ఆధారంగా ముగ్గురి పేర్లను పీసీసీ హైకమాండ్ పరిశీలనకు పంపించనుంది.

### బీజేపీ నుంచి..

బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ మంగళవారం సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ టికెట్ కోసం పలువురి పేర్లను పరిశీలించి కేంద్ర నాయకత్వానికి పంపనుంది. దీంతో బుధవారం కమలం పార్టీ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా టికెట్ రేసులో వీరపనేని పద్మ, జూటూరు కీర్తిరెడ్డి, లంకల దీపక్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో దీపక్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీ చేసి మూడోస్థానంలో నిలిచారు. ప్రస్తుతం ఆయన బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఆయనకు టికెట్ ఇవ్వకపోతే కీర్తిరెడ్డికి ఇస్తారని సమాచారం.

## బీసీ రిజర్వేషన్లపై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం



**అక్షరటుడే, న్యూఢిల్లీ:** బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీనికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సోమవారం ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున ప్రముఖ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, సిద్ధార్థ దావే వాదనలు వినిపించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి విచారణకు హాజరయ్యారు.

### సుప్రీంకోర్టు ఆగ్రహం

బీసీ రిజర్వేషన్ల అంశంపై ఇప్పటికే హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉండగా ఇక్కడకు ఎందుకు వచ్చారని ప్రశ్నించింది. హైకోర్టు స్టే ఇవ్వలేదని పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. దీంతో అక్కడ స్టే ఇవ్వకపోతే ఇక్కడకు వస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌ను తిరస్కరించింది. హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచించింది. కాగా.. ఇదే అంశంపై ఈ నెల 8న హైకోర్టులో విచారణ జరగనుంది.

## సికింద్రాబాద్‌లో దేశంలోనే అతి పెద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** హైదరాబాద్ నగర అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చెప్పేందుకు కొత్త రహదారులు, ఫ్లైఓవర్లు, ఫుట్ ఓవర్లు నిర్మాణం చేపడుతోంది. ఈ క్రమంలో జంట నగరాల్లో ఒకటైన సికింద్రాబాద్‌లో దేశంలోనే అతి పెద్ద స్టీల్ బ్రిడ్జిని నిర్మించబోతోంది. ఇది పరేడ్ గ్రౌండ్ (సికింద్రాబాద్) నుంచి శామీర్‌పేట వరకు ఉండబోతుంది. మొత్తం 18.170 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా ఈ స్టీల్ బ్రిడ్జి నిర్మించనుంది. అందులో 11.65 కిలోమీటర్ల వంతెనను పూర్తిగా స్టీల్‌తో నిర్మాణం చేపట్టనుంది. ఇది దేశంలోనే అతి పొడవైన స్టీల్ వంతెన అవుతుంది.





## హైవేలపై 'జామ్'జాటం..

**జాతీయ రహదారులు వాహనాల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ వైపు వెళ్లే రహదారులన్నీ 'జామ్'జాటంగా కనిపిస్తున్నాయి. దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో సొంతూళ్లకు తరలిన ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు ప్రయాణమయ్యారు. ఈ నేపథ్యంలో నల్గొండ, కరీనంగర్, నిజామాబాద్ నుంచి మహా నగరానికి వెళ్లే రోడ్లపై వాహనాల రద్దీ తీవ్రంగా పెరిగింది. టోల్ ప్లాజాల వద్ద వందలాది వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ జామ్ అయింది. చౌటుప్పల్, పంతంగి, చిట్యాల, తూప్రాన్, ఇందల్వాయి టోల్‌ప్లాజాలతో పాటు రాజీవ్ రహదారిపై తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.**

—అక్షరటుడే, హైదరాబాద్

## మావో నేత మల్లోజుల సంచలన లేఖ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పార్టీ క్యాడర్‌కు లేఖ రాశారు. ఆయుధాలు వీడి జనంలోకి రావాలని ఆయన సూచించారు. తాము ఆయుధాలు వీడడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన ఇటీవల లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీతో చర్చించకుండా మల్లోజుల లేఖ రాశారని మావోయిస్టుల అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు. వేణుగోపాల్ ఆయుధాలు అప్పగించాలని పార్టీ సూచించింది. ఈ క్రమంలో తాజాగా మల్లోజుల మరో లేఖతో జగన్‌కు కౌంటర్ ఇచ్చారు. సాయుధ పోరాట విరమణపై స్పష్టమైన ప్రకటన చేశారు. అంతర్గతంగా చర్చించిన తర్వాతే ఆయుధాలు వీడాలన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు బతికున్నప్పుడే ఆయుధాలు వీడాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

### పార్టీ నుంచి తప్పుకుంటున్నా..

పార్టీ చేసిన కొన్ని తప్పుల వల్ల తీవ్ర నష్టం చవిచూడాల్సి వచ్చిందని మల్లోజుల అన్నారు. పార్టీ పొలిట్ బ్యూరో నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు 22 పేజీల లేఖ విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ ఇప్పటి వరకు కొనసాగించిన పంథా తప్పని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాగా.. ఆయన పోలీసుల ఎదుట లొంగిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## అనుకోకుండా జరిగిపోయింది..

**విజయ్ దేవరకొండ – రష్మిక మందన్నా ఎంగేజ్‌మెంట్ రూమర్స్ వస్తున్న తరుణంలో.. రష్మిక తన సోషల్ మీడియాలో చేసిన ఓ పోస్ట్ నెటిజన్ల దృష్టిని మరల్చింది. తన తాజా సినిమా 'థామా' నుంచి విడుదలైన లేటెస్ట్ సాంగ్ "నువ్వు నా సొంతమా" గురించి ఆసక్తికర విషయాలను షేర్ చేసింది. ఈ చిత్రంలోని తాజా మెలోడీ సాంగ్‌ను చాలా ప్రత్యేకంగా చిత్రీకరించినట్లు రష్మిక పేర్కొంది. షూటింగ్ చివరి రోజు, దర్శక నిర్మాతలకు సడెన్‌గా వచ్చిన ఆలోచనతో ఈ పాటను ప్లాన్ చేశారట. పాట విజువల్స్ అద్భుతంగా వచ్చాయని, థియేటర్‌లో ఈ సాంగ్ ప్రేక్షకులని తప్పకుండా ఎమోషనల్‌కి గురి చేస్తుందని రష్మిక ఆశాభావం వ్యక్తం చేసింది.**

- అక్షరటుడే, సినిమాడెస్క్

